ప్రజాశక్తి
ఆదివారం 27 ఆగస్టు 2023

లోకేష్‌పై పాచిపెంట స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి-పాచిపెంట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై వైసిపి సోషల్‌మీడియా కన్వీనర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా నిర్వహిస్తున్న బహిరంగ సభలలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతూ దాడులకు పాల్పడాలని పిలుపునివ్వడంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఎటువంటి దాడులూ జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో నియోజకవర్గ కో-కన్వీనర్ బూర పైడిరాజు, మండల కన్వీనర్ తట్టికాయల జయప్రకాశ్, మండల కో కన్వీనర్లు ఔతు సాగర్ రెడ్డి, మద్దు లక్ష్మణ తదితరులు ఉన్నారు.

'దొర'కని భరోసా?

- నాడు రాజన్నదొర నీతిమంతుడని జగన్ ప్రశంసలు
- నేడు గిరిజన వర్సిటీ సభలో రాజన్న ఊసెత్తని సిఎం
- డిప్యూటీ సిఎం భవితపై నీలినీడలు

మరడాం సభలో సిఎం ప్రసంగిస్తుండగా పక్కనే నిలబడిన రాజన్నదొర

డిప్యూటీ సిఎం రాజన్నదొర రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పట్టణ నడిబొడ్డున నిర్వహించిన బహిరంగ సభకి, శుక్రవారం దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో జరిగిన గిరిజన యూనివర్సిటీ బహిరంగ సభకీ స్పష్టమైన తేడా కనిపించింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర విషయంలో వైసిపి అధినేత, సిఎం జగన్ మోహన్ రెడ్డి మాటతీరులో అంత స్పష్టమైన తేడా కనిపించడానికి కారణాలేమిటనే చర్చ మొదలైంది.

ప్రజాశక్తి-సాలూరు

2019లో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా పట్టణానికి వచ్చిన వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. పట్టణ నడిబొడ్డున నిర్వహించిన బహిరంగ సభలో అప్పటి ఎమ్మెల్యే రాజన్నదొరను పక్కన నిలబెట్టుకున్న జగన్ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. గిరిజనుడైన రాజన్నదొర నీతిమంతుడని, రూ.30 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చినా పార్టీ ఫిరాయించలేదని కితాబిచ్చారు. పార్టీ ఫిరాయించిన బొబ్బిలి రాజు కన్నా దొర నిజాయతీపరుడని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా రాజన్నదొరను గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాంటి ప్రశంసలందించిన జగన్.. శుక్రవారం దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో నిర్వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో ఆయన గురించి కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదు. నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క వరం కూడా ప్రకటించలేదు. సిఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన సమయంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర పక్కనే నిలబడ్డారు. జగన్ 35 నిమిషాల ప్రసంగంలో దొర గురించి ప్రస్తావించకపోవడం సరికొత్త చర్చకు తెరలేపింది. మరో ఆరు నెలల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో సిఎం జగన్ డిప్యూటీ సిఎంగా రాజన్నదొర పనితీరు గురించి పల్లెత్తు మాట అనలేదు. 2024లో జరిగే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మళ్లీ రాజన్నదొరని ఆశీర్వదించాలని చెప్పకపోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల వైసిపి సోషల్ మీడియా గ్రూపుల్లో రాష్ట్రంలో దాదాపు 79 నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితా హల్‌చల్ చేసింది. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులందరూ 90 శాతం గెలుపు గుర్రాలేనన్న వాదనలు వినిపించాయి. ప్రస్తుత నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం నిశితంగా పరిశీలిస్తే రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. అలాగైతే వైసిపి సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చిన తొలి విడత జాబితాలో రాజన్నదొరకూ చోటుదక్కాలి. కానీ అందులో దొరకు చోటుదక్కలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యానారాయణ, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి పేర్లు ఆ జాబితాలో కనిపిస్తున్నాయి. తొలివిడత జాబితాలో చోటు దక్కకపోవడం, నిన్న మొన్నటి సిఎం జగన్ సభలో దొర ప్రస్తావన లేకపోవడం వంటి పరిణామాలు రాజన్నదొర భవితవ్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి.

సర్వేల్లో ప్రతికూల పవనాలే కారణమా?

వైసిపి అధిష్టానం సొంతంగా కొన్ని మీడియా సంస్థలతో రానున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై రహస్యంగా సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సర్వేల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయనే వాదనలు గుప్పుమన్నాయి. రోజూ స్థానికంగా ఉన్నప్పుడు ఉదయం 11 గంటల తర్వాతే ప్రజలకు అందుబాటులో ఉంటారని, నియోజకవర్గ పార్టీపై నియంత్రణ లేకపోవడం, మండలాలు, పట్టణంలో నాయకుల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలను చక్కదిద్దడంలో వైఫల్యం, డిప్యూటీ సిఎం, మంత్రి హోదాలో జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే రీతిలో వ్యవహరించకపోవడం, పూర్తిగా ఉమ్మడి జిల్లా అగ్రనేత కనుసన్నల్లో పని చేస్తుండడం వంటి అంశాలు పార్టీ అంతర్గత సర్వేల్లో ప్రతికూలతకు కారణాలనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ప్రధానంగా మున్సిపాలిటీలో పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ ముదిరి పాకాన పడుతున్న తీరు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారడం కూడా దొర నాయకత్వంపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది.

పుష్పశ్రీవాణికి ఆశీస్సులు

ఇటీవల కాలంలో కురుపాం నియోజకవర్గంలో సిఎం జగన్ పర్యటించారు. అక్కడ నిర్వహించిన సభలో సిఎం జగన్ మాజీ మంత్రి పుష్పశ్రీవాణి గురించి ప్రస్తావిస్తూ ఆశీస్సులు అందించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పుష్పశ్రీవాణిని మళ్లీ గెలిపించాలని జగన్ కోరారు. కానీ సాలూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో మాత్రం రాజన్నదొర ఊసెత్తని పరిస్థితి కనిపించింది. అధికారపార్టీలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో రానున్న ఎన్నికలు సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టవచ్చునని పలువురు భావిస్తున్నారు.

ఎమ్‌పిపై దొరకు ఆశలు

అరకు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర గత ఎన్నికల నుంచి ఆశిస్తున్నారు. అయితే గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని దొరపై ఒత్తిడి చేశారు. దీంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రానున్న ఎన్నికల్లోనూ వైసిపి ఎమ్‌పి సీటు కావాలనే కోరికని ఆయన కొంతమంది ముఖ్య నేతల వద్ద వ్యక్తం చేశారని సమాచారం. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొర అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలపై కొంత అసంతృప్తితోనూ ఉన్నారు. గ్రూపు రాజకీయాలపై విసుగుతో ఎమ్‌పి అయితే కొంత ప్రశాంతత ఉంటుందని ఆయన యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధిష్టానం ఆయన సీనియారిటీని ఏవిధంగా వినియోగించుకుంటుందో వేచి చూడాలి.

30 నుంచి సిపిఎం సమరభేరి

విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపు

సీతానగరం.. మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. స్థానిక గాయత్రీ కళాశాలలో శనివారం సిపిఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడుతూ, పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో ధరల పెరుగుదలతోపాటు మతోన్మాద శక్తుల దాడులు పెరిగాయన్నారు మణిపూర్ ఘటనలో చాలామంది అమాయకులు హింసించబడ్డారని తెలిపారు. బిజెపి మతోన్మాద శక్తుల దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచి సామాన్యుడి నడ్డివిరిచిందన్నారు. నిత్యావసర వస్తువు ధరలు ఆకాశాన్ని అంటాయని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై వైసిపి, టిడిపి, జనసేన మాట్లాడడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన సమరభేరి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, మండల నాయకులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, ఆర్.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : పాచిపెంట మండల కేంద్రంలో సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమరభేరి వాల్‌పోస్టర్‌ని విడుదల చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయాలని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని, తదితర డిమాండ్లపై సమరభేరి చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు ఎం.గంగరాజు, పాముల సన్యాసి, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : బియ్యాలవలస పంచాయతీ మంత్రజోల గ్రామంలో శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, జియ్యమ్మవలస మండల కార్యదర్శి కె.సీతారాం సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీనికి కారణం మోడీ విధానాలేనని స్పష్టంచేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రచారం చేసి, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద, 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : మోడీ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనని సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో సమరభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామాల్లో ప్రచారం, సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 1న గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం , 4న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, మండల నాయకులు సన్యాసిరావు, మోహనరావు, రమేష్ పాల్గొన్నారు.

సీతంపేట : కేంద్ర ప్రభుత్వం అనుసరిసున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టే సమరభేరి పోస్టర్లను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు ఆవిష్క రించారు. ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.భాస్కర రావు, జె.శ్రీరాములు, ఎం.వెంకట రావు, జె.సుంద రమ్మ, జె.మధు సూదన్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట.. సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

గిరిజనుల ధర్నా

విఎస్ఎస్ భూములకు రక్షణ కల్పించాలని

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తరతరాల నుంచి తమ సాగులో ఉన్న వన సంరక్షణ సమితి భూములకు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు రక్షణ కల్పించాలని సిపిఎం ఆధ్వర్యాన జెకెపాడు గిరిజనులు శనివారం నిరసన చేపట్టారు. కొందరు నాయకులు ఇళ్ల స్థలాల పేరుతో బయట ప్రాంతాలకు చెందిన గిరిజనులను తీసుకువచ్చి విఎస్ఎస్ భూమిని దౌర్జన్యంగా, అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గిరిజనులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇందులో భాగంగా తోలుఖర్జ, మంగళాపురం గ్రామాలకు చెందిన గిరిజనులకు, జెకె పాడు గిరిజనులకు మధ్య తగాదా పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. ఇళ్ల స్థలాలు అడుగుతున్న వారికి ఇదివరకే రెండు మూడు ఇళ్లు ఉన్నాయని అధికారుల విచారణలో తేలిందన్నారు. విఎస్ఎస్ భూమిని సాగుచేస్తున్న జెకెపాడు గిరిజనులకు అటవీశాఖ అధికారులు ఉమ్మడి పట్టా కూడా మంజూరు చేశారని తెలిపారు. దౌర్జన్యంగా భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న నాయకులపై పోలీసు కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండంగి రమణ, ఎం.సన్యాసిరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ఎల్విన్ పేటలో ధర్నా చేస్తున్న జెకెపాడు గిరిజనులు

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఇ-పంట నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. పాలకొండ మండలం వెలగవాడ గ్రామంలో ఇ-పంట నమోదు ప్రక్రియను శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో పంట నమోదు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఇ-పంట నమోదుకు రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైతులు పంట నమోదులో వ్యవసాయ శాఖకు సహకరించాలని అయన కోరారు. పిఎం కిసాన్‌కు సంబంధించి 805 ఖాతాలకు అవసరమైన మేరకు మ్యుటేషన్లు, ఆధార్ తప్పుగా ఉంటే వాటిని సరిచేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందికి పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి గోవిందరావు



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు

జ్యూట్ కార్మికుల దీక్షలకు ఎల్ఐసి ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

జీగిరాం జ్యూట్ మిల్లును తెరవాలని కార్మికులు చేపడుతున్న దీక్షలకు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి టెక్కలి ధర్మారావు మద్దతు తెలిపారు. జ్యూట్‌మిల్లు వద్ద జెఎసి ఆధ్వర్యాన దీక్షలు శనివారం ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏకైక జ్యూట్‌మిల్లు ఇదేనని, అనేక మంది ఉపాధి పొందేవారని తెలిపారు. మిల్లు మూతపడటంతో వారంతా ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జ్యూట్‌మిల్లు తెరచి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదోరోజు దీక్షలలో కొల్లి గోపమ్మ, వై.కొండమ్మ, బేత తౌడమ్మ, ఎం.సత్యవతి, భవాని కూర్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, పట్టణ కార్యదర్శి టి.వెంకటరావు, జెఎసి నాయకులు సూరప్పలనాయుడు, సూర్యనారాయణ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, గంగరాజు, సింహాచలం పాల్గొన్నారు.

విచారణ వేగవంతం

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

బోగస్ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణను వేగవంతం చేస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి తెలిపారు. శనివారం బోగస్ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన ఫిర్యాదులపై డిఎల్ఎస్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులు ఎదుర్కొంటున్న వారి కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించారు. ఫిర్యాదు చేసిన వారి వద్ద ఉన్న ధ్రువపత్రాలను కూడా పరిశీలించారు. 3 కేసులకు సంబంధించి శనివారం విచారణ చేపట్టారు. మరిన్ని ఆధారాలు తీసుకురావాలని ఇరువురికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

మాకు మీరు...మీకు మేము

ప్రజాశక్తి - విజయగరం ప్రతినిధి

జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు 'మాకు మీరు... మీకు మేము' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాధనాన్ని, భూములను కారు చౌకగాను, ఒకింత సులభతరంగానూ చేజెక్కించు కునేందుకు అంతా ఒక్కటౌతున్నారు.' ఇదేదో వేరొక రాజకీయ పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న విమర్శలు కాదు సుమా...! నాయకుల వ్యవహారశైలి పై పెల్లుబుకుతున్న పబ్లిక్ టాక్. ఇందుకు ఎన్నో సందర్భాలను, రాజకీయ విన్యాసాలను ఉదాహరణగా చెప్పుకుంటున్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో రూ.కోట్లు విలువ చేసే 30ఎకరాల భూమిని పరిశ్రమ పేరిట జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబీకుల పేరున రూ.10లక్షలకే కట్టబెట్టినట్టు వార్తలు వచ్చిన విషయం విధితమే. దీనిపై ప్రతిపక్షం స్పందించే తీరుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. మొదటి రెండు రోజులపాటు టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున, టిడిపి బొబ్బిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బేబినాయన కొంత హడావుడి చేసినప్పటికీ ఆ తరువాత మిన్నకుండిపోయారు. విమర్శలు మనహా మంత్రి కుటుంబీకులకు భూమి కేటాయింపుపై నిఖరమైన పోరాటం చేయలేదు. వీరి సంగతి కాసేపు పక్కనబెడితే.. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులుగా, టిడిపిలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట వరసకు కూడా స్పందించలేదు. దీంతో, అశోక్ తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి మాన్సాస్‌లో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, వేల కోట్ల విలువ చేసే భూములు, భవనాలు, స్థలాలు, 13 విద్యాసంస్థలు ఉన్న ఆ ట్రస్ట్‌లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నట్టు లెక్కలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాన్సాస్ ట్రస్ట్ లెక్క తేలుస్తామంటూ వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్త మంత్రి బొత్స హడావుడి చేసినప్పటికీ ఆ తరువాత మిన్నకుండి పోయారు. విజయసాయిరెడ్డి జరిపిన ఫ్లోరెన్సిక్ ఆడిట్ రిపోర్టు కూడా బుట్టదాఖలైపోయింది. ఈ నేపథ్యంలో బొత్సపై అశోక్ అప్పుడప్పుడూ విమర్శలు చేస్తున్నప్పటికీ ఉదారతగానే వ్యవహిస్తారని చాలా మంది నోట వినిపిస్తున్నమాట. గతంలో సీతం కళాశాల స్థలంపై సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున పోరాటం జరిగినప్పటికీ అశోక్ స్పందించలేదు. ఇంకోవైపు పార్టీలో అశోక్‌కు తానేమీ తీసిపోను అన్నట్టుగా వ్యవహరిస్తున్న కిమిడి కళావెంకటరావు కూడా బొత్సపై వచ్చిన ఆరోపణలపై స్పందించలేదు.అందరూ అంటున్నట్లుగా ఆయన కుమారుడిపేరున అప్పటి టిడిపి ప్రభుత్వం 10ఎకరాలు కట్టబెట్టిన తీరువల్లేనేమో అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు చేసిన ప్రకటనపైనా కళావెంకటరావునుంచి స్పందన లేదు. మరోవైపు ఎస్.కోట నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయంటూ సుమారు నెల రోజుల క్రితం అదే ప్రాంతంలోవుంటున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రకటించారు. త్వరలో అందరి బాగోతం బయటపెడతానని కూడా హెచ్చరించారు. రోజులు నెలలు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ భాగోతమేదో బయటపెట్టక పోవడంతో లోలోపల ఏదో సెట్టింగులు జరిగిపోతున్నాయంటూ చర్చమొదలైంది. ఇలా ప్రభుత్వ లోపాలను, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులపై టిడిపి నాయకులు స్పందించడం లేదని, అటు టిడిపి నాయకులపై రాజకీయ ఆరోపణలు తప్ప గతంలో చేసిన, జరిగిన అక్రమాలపై వైసిపి నాయకులు కూడా నోరు మొదపడం లేదని జిల్లాలో చర్చ నడుస్తోంది.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు పల్లవీధికి చెందిన కుదిగాన ధనుంజయ గత మే నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన భార్య పల్లా మహాలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.లక్ష చెక్కును శనివారం ఎమ్మెల్యే వి.కళావతి పాలకొండ పట్టణంలో అందజేశారు. మహాలక్ష్మి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెలమల మన్మథ, కడగల రమణ, బాసురు కాంతారావు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, కోడెం విజయకుమార్, గణపతిరావు, తైలాపు సూర్యారావు, సత్యనారాయణ, టేకు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సాలూరు

యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని ఎయిమ్ రామా యోగా ట్రస్ట్ అధ్యక్షులు ఆరిశెట్టి ఇందుమణి చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యోగా డిప్లొమా కోర్సుల నిర్వహణకు ఆంధ్రా యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఏ డిగ్రీ కలిగిన వారైనా యోగా డిప్లొమా చేయడానికి అర్హులని, ఆరు నెలల కోర్సని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కలిగిన వారు ఎయిమ్ రామా యోగా ట్రస్ట్, వేద సమాజం వీధి, సమతా బిల్డింగ్ ఎదురుగా, సాలూరు చిరునామాలో సంప్రదించాలని ఆమె కోరారు.

మదర్ థెరీసాకు ఘన నివాళి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస ప్రాథమిక పాఠశాలలో శనివారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు మాట్లాడుతూ మదర్ థెరీసా అందించిన సేవలు గురించి వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన ఆర్మీ జవానులు వృద్ధులకు ఆర్థిక సహాయంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. హైదరాబాద్‌లో సిఐగా విధులు నిర్వహిస్తున్న యామక గౌరునాయుడు తన కుమార్తె నేహ దీపిక ద్వారా పాఠశాలకు మెగాఫోన్ అందజేశారు. విద్యార్థి నేహ దీపిక.. మదర్ థెరీసా వేషధారణతో ఆకట్టుకుంది.

పార్వతీపురం రూరల్ : మదర్ థెరీసా జయంతిని శనివారం పార్వతీపురంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కృష్ణపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కార్యాలయంలో థెరిసా చిత్రపటానికి ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ బెలగాంలో సత్య టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సిక్కోలుపై ప్రభుత్వం చిన్నచూపు

ప్రజాశక్తి-సీతంపేట

సిక్కోలు జిల్లాపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. జిల్లా విభజన ఏడాదిన్నర కావస్తున్నా సిక్కోలుకు ఐటిడిఎ నిర్మించకపోవడం దారుణమన్నారు. సీతంపేట ఐటిడిఎ వద్ద శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మరడాం సభలో సిఎం జగన్.. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ప్రకటిస్తారని చాలా ఆశగా చూశామన్నారు. ఎటువంటి ప్రకటనా చేయకపోవడం వల్ల శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసీలంతా నిరాశ చెందారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి, మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షులు గురడి అప్పన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి బైలాపురం సింహాచలం, కొత్తూరు కిరణ్, పెద్దింటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై విఎలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం షణ్ముఖరాజు మాట్లాడుతూ పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపైన శిక్షణ ఇచ్చారు. భూసార యాజమాన్యంపై, మార్కెటింగ్‌పై, కాంపాక్ట్ బ్లాక్‌పై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షకులు దేవిప్రసాద్, పిఎఒ హరికృష్ణ, తిరుపతి, బాలు తదితరులు పాల్గొన్నారు.

టిటిడి నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

టిటిడి పాలక మండలిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యానాదయ్యను సభ్యులుగా నియమించడంపై ఆ సంఘం జిల్లా పి.శివప్రసాద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులను పట్టించుకోని పిహెచ్‌సి సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

డోకిశీల పిహెచ్‌సిలో రోగులను సిబ్బంది పట్టించుకోవడం లేదని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు ఆరోపించారు. శనివారం వారు మాట్లాడుతూ వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఏదైనా అడిగితే పిహెచ్‌సి సిబ్బంది రోగులతో గొడవ పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

29న కురుపాం మండల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 29న ఎంపిపి శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులంతా వారి శాఖకు సంబంధించి పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని, వారి పరిధిలో సమస్యలు ఏమైనా ఉంటే సమావేశంలో చర్చించాలని తెలిపారు.

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

జనసేన పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం ఆధ్వర్యంలో అచ్చబ గ్రామంలో శనివారం ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన కార్యకర్తల సంక్షేమం కోసం ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ప్రమాద బీమాను అధినేత పవన్ కళ్యాణ్ అమలు చేశారని తెలిపారు. సామాన్యుల సంక్షేమ ధ్యేయంగా జనసేన మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను నిర్ణయించి, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు నిమ్మక దుర్గారావు, జనసైనికులు సందీప్, ధర్మారావు, విశ్వనాథం, మురళి, జయరాజు పాల్గొన్నారు.

ఎర్రసామంతవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సహకారంతో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి వైద్యులు సేవలందించి, మందులు అందజేశారు. సుమారు 56 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి పుష్పనాథం, సర్పంచ్ సీదరపు గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు సర్వే

సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి-కొమరాడ

ఇంటింటి ఓటరు సర్వే పక్కాగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని దుగ్గి, కొమరాడ, గుమడ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఓటర్ జాబితా సరిచేసేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతుందన్నారు. ఇప్పటికే మృతిచెందిన ఓటర్లను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతోపాటు తీర్మానాలతో ఓటర్ జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. వలస వెళ్లే ఓటర్లను కూడా తొలగించేందుకు అవసరమైన తీర్మానాలు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులను సవరించేందుకు బిఎల్‌ఒల ద్వారా ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా చేరేందుకు మంచి అవకాశమన్నారు. ఇంటింటి ఓటరు సర్వేలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, బిఎల్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఓటర్ సర్వే వేగవంతం

సీతంపేట : ఇంటింటి ఓటరు సర్వేను వేగవంతం చేస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి తెలిపారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఓటరు సర్వే చేపతున్నామన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించేటప్పుడు నిబంధనలు పాటిస్తున్నామన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు కోసం వచ్చిన వాటిని వెంటనే నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు అప్పారావు, నరసింహమూర్తి, ఎపిఒ రోషిరెడ్డి, సర్పంచ్ జి.సుందరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల సింహగర్జన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

సెప్టెంబర్ 15న విజయవాడలో నిర్వహించే అగ్రిగోల్డ్ బాధితుల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఇ.వి.నాయుడు కోరారు. ఈ మేరకు మండలంలోని బాసూరు గ్రామంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు బెహరా బంగారి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేశారు. స్థానిక ఖాతాదారుల ఒత్తిడితో గుండెపోటుతో ఆకాలమరణం చెందిన బెహరా వెంకటి కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం గ్రామంలో అగ్రిగోల్డ్ బాధితులతో ఇ.వి.నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని, అందుకే ఇలాంటి మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. బాధితులు ధైర్యంగా కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి పైడి గోవిందరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సోమశేఖరరావు, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

గిరిపుత్రులను మభ్యపెట్టిన వైసిపి

టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

గిరి పుత్రులను వైసిపి ప్రభుత్వం మభ్య పెడుతోందని విజయనగరం పార్లమెంట్‌స్థానం టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. శనివారం ఆయన అశోక్‌బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గిరిజన యూనివర్సిటీ నిర్మాణం కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలంలోని రెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని గిరి జన ప్రాంతానికి సమీపమైన అప్పన్నదొరపాలెం వద్ద భూమిని గుర్తించి, స్థల సేకరణ చేసి యూనివర్సిటీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిందని తెలిపారు. ప్రహారీగోడ కూడా నిర్మించిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ నిర్మాణాన్ని పక్కనబెట్టి తీవ్రకాలయాపన చేసిందన్నారు. శంకస్థాపన చేసిన స్థలాన్ని కాదని మళ్లీ క్రొత్తగా వేరొకచోట శంకుస్థాపన చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. డాక్టర్ పివిజిరాజు పాచిపెంట వద్ద సుమారు 3వేలఎకరాలు భూమిని గిరిజన విశ్వవిద్యాలయం కోసం గతంలో ఇచ్చినప్పటికీ, రవాణా సౌకర్యాలు, విమానాశ్రయం వంటి సదుపాయాలు మెరుగ్గా ఉండే ప్రాంతం కావాలని తెలపడంతో, రెల్లి గ్రామం వద్ద టిడిపి ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు.

ఏ ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం స్థలం మార్పిడి చేసిందో అర్థం కావడం లేదన్నారు. నాలుగే ళ్లుగా నిర్మాణం చేసి ఉంటే నేడు విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేదని, కానీ ఈ ప్రభుత్వానికి యూనివర్సిటీ నిర్మాణం పట్ల, గిరిజన విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం తప్పా ఈ ప్రభుత్వం చేసిన ఘనకార్యం ఏమీలేదన్నారు. గిరిజనుల పట్ల దొంగ ప్రేమను చూపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తప్పకుండా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

కేంద్రమంత్రికి సన్మానం.. గిరిజనులకు అవమానం

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ

ప్రజాశక్తి-సాలూరు

'ఆంధ్రా గోబ్యాక్' అని నోరు పారేసుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకి పిలిచి సన్మానించడం కొటియా గిరిజనులను అవమానించడమేనని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ వ్యాఖ్యానించారు. శనివారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసిపి.. బిజెపి నాయకులతో నడుపుతున్న అవగాహన రాజకీయాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కొటియా గ్రామాల్లో పర్యటించడానికి వెళ్లిన ఆంధ్రా వైద్యాధికారి, సిబ్బందిని ఒడిశా పోలీసులు అడ్డుకోవడం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సన్మానించిన సమయంలోనే జరిగిందన్నారు. కొటియా గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు ఎపి వైద్య సిబ్బంది వెళ్తుండగా ఒడిశా పోలీసులు అడ్డగించారని చెప్పారు. ఇది గిరిజనులను అవమానించడమేనని అభిప్రాయ పడ్డారు. కొటియా గ్రామాల గిరిజనులను ఒడిశా పోలీసులు రకరకాలుగా వేధింపులకు గురిచేస్తున్నా ఆంధ్రా ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కనీసం క్షమాపణ చెప్పించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. కొటియా గిరిజనులకు అండగా నిలబడాలని కోరారు.

దీక్షా శిబిరంలో పాల్గొని మద్దతు తెలుపుతున్న అప్పలనాయుడు, ఇ.వి.నాయుడు

పదో రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి-కొమరాడ

నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం కోసం చేపడుతున్న రిలే దీక్షలో శనివారం పదో రోజుకు చేరాయి. దీక్షలకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సిపిఐ జిల్లా నాయకులు ఇ.వి.నాయుడు, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.సంఘం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దీక్షలో సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, పకీరు శంకర్రావు, లక్ష్మణరావు, పోలినాయుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-మక్కువ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలపై దృష్టి సారించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి. జగన్మోహనరావు వైద్యులకు, సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని శంబర, మక్కువ పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు ఏ మేరకు జరుగుతున్నాయి, వాటి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ప్రసూతి గదులను పరిశీలించి డెలివరీ సమయంలో ఉపయోగిస్తున్న పరికరాలు, అత్యవసర మందులు, ఆక్సిజన్ సదుపాయం, తదితర అంశాలపై సిబ్బందిని ఆరాతీశారు. బేబీ వార్మర్ పనితీరును పరిశీలించారు. నెలవారీ పిహెచ్‌సిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. పిహెచ్‌ల్లో డెలివరీ అయ్యేలా వైద్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. నూతన పిహెచ్‌సి భవన నిర్మాణ దశ, ప్రక్రియపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు పూర్తయితే మరింత మెరుగైన సేవలు అందించవచ్చున్నారు. వ్యాక్సిన్ నిల్వలు, మందులు, ల్యాబ్ తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ జ్వరాలను గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి, క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పిహెచ్‌సికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి, వారి అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, ఎంవి.కిరణ్ కుమార్, సూపర్‌వైజర్ సరస్వతి, వెంకటరత్నం, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్నాథరావు

సాగుభూమిలో సెల్‌టవర్లు ఏర్పాటు చేయొద్దు

టవర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన రైతులు సాగు చేస్తున్న భూమిలో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలో మూలుగూడ జంక్షన్ వద్ద దురబిలి గిరిజనులు సాగు చేస్తున్న భూమి వద్ద చేపడుతున్న బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు 50 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదే భూమిని నమ్ముకొని జీవనాధారంగా బతుకు తున్న గిరిజనుల పొట్ట కొట్టవద్దని కోరారు. సాగు భూమిలో కాకుండా వేరే స్థలంలో టవర్ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఏదైనా నిర్మాణం చేయాలంటే పీసా చట్టం ప్రకారం గ్రామసభ ఆమోదం కావాలని, సాగులో ఉన్న రైతులు అంగీకరించాలని, కానీ తీర్మానాలు, ఆమోదాలు లేకుండా సెల్‌టవర్ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పువ్వల పత్తి , తదితరులు పాల్గొన్నారు.

గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఇఒ సింహాచలం, సిబ్బంది

గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బలిజిపేట

తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు చిత్ర పటానికి ఎంఇఒ సామల సింహాచలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సవర భాషా అభివృద్ధికి గిడుగు ఎంతో కృషి చేశారని తెలిపారు. గిడుగు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డిఎ భద్ర, సిఎంఆర్‌టిలు ఝాన్సీ, సుభాషిణి, శ్రీరామ్, వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వెలుగు స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవరావు ఆధ్వర్యంలో సీతంపేట మండలానికి చెందిన 40 మంది రైతులు గుమ్మలక్ష్మీపురం మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను శనివారం పరిశీలించారు. గొరడ గ్రామంలో తాడింగి బంగార్రాజు తోటలోని అంతర పంటలు, శ్రీవరి పంటలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఆదాయ వ్యయాలను వివరించారు. అనంతరం రాయగడ జవమ్మ గ్రామంలో పువ్వల సుందరమ్మ జీడి తోటల్లో పలు పంటలు, జీవామృతాలు పరిశీలన, తయారు చేసే విధానాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జట్టు కో-డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, మా తోట జీవ కమిటీ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య, జీవ కోఆర్డినేటర్ జి.ప్రబోద్, జి.మురళీమోహన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రైతులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో 24వ వార్డులోని తాళాబత్తుల వీధిలో సిసి కాలువలు, రోడ్డు పనులకు శనివారం కౌన్సిలర్ మంత్రి రవికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ వార్డులో పలు సమస్యలను గుర్తించామని, ఇందులో భాగంగా ఈ అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టరుకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ సీఎంగా ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాడ్డి అరుణ, శంకరరావు, మజ్జి శశికర్, ఆర్.బంగారునాయుడు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ, వైసిపి సీనియర్ నాయకులు మజ్జి శేఖర్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.